క్లుప్తంగా

మాతా శిశు సేవలు సక్రమంగా అందించండి



లబ్బీపేట(విజయవాడతూర్పు): పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో మాతా శిశు సంరక్షణ సేవలు సక్రమంగా అందించాలని ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని ఆదేశించారు. ఆమె నగరంలోని తన కార్యాలయంలో మంగళవారం పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు తదితరులతో పలు అంశాలపై సమీక్ష జరిపారు. అందులో భాగంగా మాతా శిశు సంరక్షణ సేవలు మరింత మెరుగు పర్చాలని సూచించారు. ఆయుష్మాన్ భారత్ గుర్తింపు సంఖ్యలు మ్యాపింగ్, ల్యాబ్ పరీక్షలు నివేదికలు అమలు, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డుల నిర్వహణ, వ్యాధి నిరోధక టీకాల నిర్వహణ వంటి అంశాలపై సమీక్షించారు. అంతేకాక క్షయ, లెప్రసీ వ్యాధుల నివారణ కార్యక్రమం అమలుపై దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో డీఎల్టీఓ డాక్టర్ జె.ఉషారాణి, డీఐఓ డాక్టర్ అమృత, డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఇందుమతి, వైద్యులు పద్మావతి, మాధవినాయుడు, మోతీబాబు, స్నేహసమీర, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సందేశాత్మకంగా 'ప్రేమకు పరాకాష్ట'



విజయవాడ కల్చరల్: గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై మంగళవారం ప్రదర్శించిన సాంఘిక నాటకం ప్రేమకు పరాకాష్ట సందేశాత్మకంగా సాగింది. శ్రీధర్ ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ పాలకొల్లు, రవి అండ్ రవి ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పరమ పవిత్రమైన భారతీయ వివాహ వ్యవస్థను నేటి తరానికి వివరించడమే లక్ష్యంగా నాటకం సాగింది. రచన, దర్శకత్వం మాడుగుల వెంకట కృష్ణ ప్రసాద్, పాత్రలలో జి. మనుప్రియ, శ్రీధర శ్రీనివాస్ నటించారు. న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా కళాకారులను అభినందించారు.

విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ పోటీలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భారత రత్న అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. మంగళవారం ఠాగూర్ గ్రంథాలయంలో అబ్దుల్ కలాం జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి వికాస వాహిని స్వచ్ఛంద సంస్థ హైస్కూల్ విద్యార్థులకు వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించింది. ఈ పోటీలలో నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన 127 మంది పాల్గొన్నారు. పోటీలలో నున్న జెడ్పీహెచ్ఎస్, చిట్టూరి హైస్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. విజేతలను జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు అభినందించారు. వారికి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ రామన్ రావు, గ్రంథాలయ అధికారి రమాదేవి, విద్యార్థి వికాస వాహిని వ్యవస్థాపకుడు కేశవరావు పాల్గొన్నారు.

సీనియారిటీ జాబితా సరిచేయాలని డిమాండ్



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీ రవాణా శాఖ జోన్–3 నందు పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ పరిపాలనాధికారుల సీనియారిటీ జాబితాను సరిచేయాలని భారతీయ బౌద్ధ మహాసభ సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు బేతాళం సుదర్శనం డిమాండ్ చేశారు. మంగళవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రవాణా శాఖ ఎస్సీ,ఎస్టీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ సీనియారిటీపై ఈనెల 10న ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ ఉత్తర్వులు సుప్రీం కోర్టు తీర్పులకు వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. రవాణా శాఖ కమిషనర్ మనీష్ కుమార్ సిన్హా, జేటీసీ రమశ్రీ భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా పనిచేస్తూ, ఎస్సీ, ఎస్టీల పట్ల వివక్షత చూపుతున్నారని, వారిని విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. క్యాచ్ అప్ రూల్స్ అమలు నిలిపివేయాలని కోరారు. ఆర్పీఐ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి చెన్నకేశవులు, ఆంధ్ర మాల్యాద్రి, వై. శ్యామ్ కుమార్, నల్లబోతుల మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో బస్‌షెల్టర్ల కరువు



సింగ్‌నగర్ డాబా కొట్ల సెంటర్‌లో బస్సు కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు



మీసాల రాజేశ్వరరావు వంతెన వద్ద వేచి ఉన్న ప్రయాణికులు

- వర్షానికి తడుస్తూ, ఎండకు ఎండుతూ బస్సుల కోసం ప్రయాణికుల నిరీక్షణ
- సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికుల వినతి

బస్టాండ్(విజయవాడపశ్చిమ): ప్రయాణికులకు సౌకర్యవంతమైన, సురక్షితమైన ప్రయాణాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రజారవాణా సంస్థ(ఆర్టీసీ) ప్రయాణికులకు తగిన సౌకర్యలు కల్పించటంలో పూర్తిగా విఫలమైందనే విమర్శలున్నాయి. పేద, మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా ప్రయాణించే ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణమంటేనే ప్రజలు వెనకడుగు వేస్తున్నారు.

అవస్థలు వర్ణనాతీతం..

అతి పెద్ద ప్రజా రవాణా సంస్థల్లో ఒకటిగా ఉన్న ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలంటే ప్రయాణికులు పడే పాట్లు వర్ణనాతీతంగా ఉన్నాయి. కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నా ప్రయాణికులకు మాత్రం సరైన సౌకర్యలు కల్పించటంలో అధికారులు పూర్తిగా విఫలం చెందుతున్నారు. నగరంలో రద్దీగా ఉండే ప్రధాన రోడ్లపై బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయకపోవటంతో ప్రయాణికులు నిలువ నీడలేక ఎండలో ఎండుతూ, వర్షానికి తడుస్తూ బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రధాన మార్గాల్లో కనిపించని బస్‌షెల్టర్లు..

నగర పరిధిలో ఆర్టీసీకి అధిక ఆదాయాన్ని తీసుకువచ్చే ప్రధాన రూట్లు అయిన నున్న, వన్‌టౌన్, భవానీపురం, బందరు రోడ్డు తదితర ప్రాంతాల్లో బస్‌షెల్టర్లు లేవు. ఈ రూట్‌లో నిత్యం వేల సంఖ్యలో ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. పాఠశాలలకు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, అటోనగర్, ఏలూరురోడ్డు, కాళేశ్వరరావు మార్కెట్‌కు పనుల కోసం వెళ్లి వచ్చే వారితో నిత్యం ఈ రూట్లు రద్దీగా ఉంటాయి. ఇటువంటి ప్రాంతాల్లో బస్ షెల్టర్లు లేకపోవటంతో ప్రయాణికులు మండిపడుతున్నారు. నిత్యం వందల సంఖ్యలో సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్ నుంచి ఇతర ప్రాంతాలకు ప్రయాణించే వారు పడే పాట్లు వర్ణనాతీతంగా ఉన్నాయి. బస్సుల కోసం గంటల తరబడి ఎండలో నిలబడాల్సిన పరిస్థితి. కొన్ని సందర్భాల్లో ప్రయాణికులు వేచి ఉండలేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. వసతులు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



నిలబడలేక పోతున్నాం..

ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలన్నా, పని మీద బయటకు వెళ్లాలన్నా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తాం. ఆటోలకు డబ్బులు చెల్లించుకోలేక బస్సులను ఆశ్రయిస్తాం. బస్టాపుల్లో కూర్చునేందుకు బల్లలు, కనీసం బస్ షెల్టర్లు లేవు. గంటల తరబడి ఎండలో నిలబడలేకపోతున్నాం.

– ఎస్తేరమ్మ, ప్రయాణికురాలు



అధికారులు పట్టించుకోవటం లేదు...

డాబా కొట్ల సెంటర్‌లో బస్ షెల్టర్ ఏర్పాటు చేయమని ఆర్టీసీ అధికారులకు ఎన్నో సార్లు వినతి పత్రాలు ఇచ్చాం. వారి నుంచి కనీసం స్పందన లేదు. ప్రతి రోజు ఇక్కడి నుంచి వేల సంఖ్యలో రాకపోకలు సాగిస్తారు. అధికారులు అనుమతి ఇస్తే మేమే బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేసుకుంటాం.

– తిమోతి, ప్రయాణికుడు


అభ్యసన వైకల్యాలపై అవగాహన ర్యాలీ



వాక్ థాన్ నిర్వహిస్తున్న భవిత కేంద్రం నిర్వాహకులు, తల్లిదండ్రులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): డిస్లెక్సియా (అభ్యసన వైకల్యాలు) గల పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని మండల విద్యాశాఖాధికారి సాంబశివరావు అన్నారు. మంగళవారం గాంధీనగర్ సీతన్నపేట గేటు వద్ద ఉన్న భవిత కేంద్రం ప్రత్యేక అవసరాల పిల్లలు గల తల్లిదండ్రులకు అభ్యసన వైకల్యాలపై అవగాహన కల్పించేందుకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 2కే వాక్ థాన్ నిర్వహించారు. సీతన్నపేటలోని భవిత కేంద్రం నుంచి ప్రారంభమై బీఆర్టీఎస్ రోడ్డు వరకు సాగింది. ఈ వాక్‌థాన్‌ను విజయవాడ సెంట్రల్ మండల విద్యాశాఖాధికారి –1, 2 డి. సాంబశివరావు, యు.విజయరామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యసన వైకల్యం గల పిల్లలు చదువడం, రాయడంలో సమస్యలను ఎదుర్కొంటారన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారిని అర్థం చేసుకుని సమస్యల నుంచి బయట పడేందుకు ప్రోత్సహించాలని సూచించారు. థామస్ ఆల్వా ఎడిసన్, స్టీఫెన్ హాకింగ్స్ వంటి వారు కూడా చిన్న వయసులో అభ్యసన వైకల్యాలతో బాధపడ్డవారేనని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎస్.పి.ఆర్.ఎం.సి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హర్షియా బేగం, భవిత కేంద్రం ఐఈఆర్‌టీలు కె. వెంకట సుధ, జె. కుమార్ మధు పాల్గొన్నారు.

మానవ సంబంధాలతో ఒత్తిడిని జయించవచ్చు





మాట్లాడుతున్న ఇండ్ల విశాల్; హాజరైన అధ్యాపకులు, విద్యార్థులు

మానసిక వైద్యుడు ఇండ్ల విశాల్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సమయ పాలన, స్వీయగౌరవంతో పాటు మానవ సంబంధాలను పెంచుకోవడం వంటివి అలవాటు చేసుకోవడం ద్వారా నిత్య జీవితంలో ఎదురయ్యే ఒత్తిడిని జయించవచ్చునని మానసిక వైద్యుడు విశాల్ ఇండ్ల చెప్పారు. సిద్ధార్థ కళాశాల ఎంబీఏ విభాగం, సీఐఐ విజయవాడ శాఖ సంయుక్తంగా సిద్ధార్థ కళాశాల వెబ్‌నార్ హాలులో మానసిక ఒత్తిడి – నిర్వహణ అనే అంశంపై మంగళవారం సదస్సు జరిగింది. డాక్టర్ విశాల్ మాట్లాడుతూ.. నేటి తరం యువత పోటీ ప్రపంచంలో ఎక్కువగా ఒత్తిడికి గురవ్వుతున్నారన్నారు. ఆ ఒత్తిడి కారణంగా ఎక్కువగా యాక్సిడెంట్స్‌కు గురికావడం, ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. విద్యార్థులు ఏదైనా అంశంపై అతిగా ఆలోచనలు చేస్తూ ఎంతో విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారని అది సరైన విధానం కాదన్నారు. స్వీయ గౌరవం, కృతజ్ఞతా భావంతో యువత ఉండాలని సూచించారు.

ఇతరుల నుంచి ఎక్కువగా ఏమీ ఆశించకుండా సానుకూల దృక్పథంతో ఉండటం వల్ల ఎటువంటి ఒత్తిడిని అయినా జయించవచ్చని చెప్పారు. ఇమీస్ ఫార్మాసూటికల్స్ మేనేజింగ్ డైరెక్టర్ వి.నాగలక్ష్మి, సీఐఐ ప్రతినిధులు చందన్ పట్నాయక్, డీవీ రవీంద్ర, కళాశాల డీన్ రాజేష్ సీ జంపాల, ప్రొఫెసర్ రహమాన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. సదస్సు అనంతరం విద్యార్థుల సందేహాలను విశాల్ సమాధానమిచ్చారు.

అమ్మకు తోడుగా..



మున్సిపల్ కార్యాలయం వద్ద తల్లికి సాయం చేస్తున్న చిన్నారులు



దసరా ఉత్సవాల సందర్భంగా కనకదుర్గ ఆలయ ప్రాంగణం, వన్‌టౌన్ పరిసరాల్లో చిరు వ్యాపారులు, వివిధ వృత్తుల వారి సందడి నెలకొంది. తల్లిదండ్రులు పనుల్లో నిమగ్నమవ్వగా వారితో పాటు వచ్చిన చిన్నారులు సాయం అందిస్తున్న, నిద్రిస్తున్న దృశ్యాలను మంగళవారం సాక్షి కెమెరా 'క్లిక్'మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

కృష్ణవేణి ఘాట్ సమీపంలో టోపీలు అమ్మే మంచం స్టాండ్ వెనుక నిద్రిస్తున్న చిన్నారి

బ్యాంక్ ఖాతాదారులకు చిల్లర నాణేల అందజేత



నాణేలు అందజేస్తున్న యూనియన్ బ్యాంక్ అధికారులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పది రూపాయల నాణేలు చలామణిలో ఉన్నాయని, వాటిని వినియోగించుకోవచ్చని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవాడ రీజియన్ డెప్యూటీ హెడ్ హరీష్ బేత అన్నారు. ఆ బ్యాంక్ విజయవాడ మెయిన్ బ్రాంచిలో ఖాతాదారులకు పది రూపాయల నాణేల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం హరీష్ బేత ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు నాణ్యమైన, వేగవంతమైన సేవలందించేందుకు తమ బ్యాంక్ కృషి చేస్తోందన్నారు. ప్రధానంగా చిరు వ్యాపారులకు, కిరాణా దుకాణాలు, రిటైల్ వ్యాపారులకు చిల్లర నాణేల కొరత ఉంటుందని, దానిని నివారించేందుకు తమ బ్యాంక్ ప్రత్యేకంగా నాణేల పంపిణీని నిర్వహిస్తోందని చెప్పారు. ఈ అవకాశాన్ని బ్యాంక్ ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

మల్బరీ తోటల సాగుకు ప్రభుత్వ రాయితీలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: మల్బరీ తోట సాగు చేపట్టే రైతులకు ప్రభుత్వం రాయితీలు కల్పిస్తోందని సెరికల్చర్ డెప్యూటీ డైరెక్టర్ డి.వాణి అన్నారు. బాపులపాడు మండలం కె.సీతారామపురంలో మంగళవారం జరిగిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. పట్టు పురుగుల పెంకపం ద్వారా మంచి లాభాలు ఆర్జించవచ్చని ఆమె వివరించారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 75 శాతం, బీసీలకు 50 శాతం రాయితీతో మల్బరీ తోటల సాగుకు రాయితీలు అందిస్తున్నారని వివరించారు. మండల వ్యవసాయాధికారి జొన్నలగడ్డ భవాని, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం జీవితం ఆదర్శనీయం

వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త వెలంపల్లి శ్రీనివాసరావు



విద్యార్థులకు పండ్లు అందజేస్తున్న మాజీ మంత్రి వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి

వించిపేట(విజయవాడపశ్చిమ): శాస్త్ర, సాంకేతిక రంగంలో భారత దేశ కీర్తిప్రతిష్టలను ప్రపంచ స్థాయిలో నిలిపిన మాజీ రాష్ట్రపతి, భారత రత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజవర్గ సమన్వయకర్త వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నేత బాజీ ఆధ్వర్యంలో 55వ డివిజన్, నైజాంగేటుసెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం అబ్దుల్ కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి వెలంపల్లి, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలసి అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

పుస్తకాలు, పెన్నులు, పండ్ల పంపిణీ

ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ.. అబ్దుల్ కలాం భారత దేశానికి రాష్ట్రపతిగా, శాస్త్రవేతగా వెలకట్టలేని సేవలను అందించారని కొనియాడారు. పేదరికం ప్రతిభకు అడ్డంకి కాదని నిరుపించిన ఆయన పేద కుటుంబంలోజన్మించి దేశ మొదటి పౌరుడిగా ఎదిగిన ఆయన ప్రస్థానం అందరికీ ఆదర్శమన్నారు. విద్యతోనే దేశం అభివృద్ధి సాధిస్తుందని నమ్మిన ఆయన విద్యాబోధనలోనే తుది శ్వాస విడిచారని స్మరించుకున్నారు. అటువంటి మహనీయున్ని నేటి యువత ఆదర్శంగా తీసుకుని దేశం గర్వించదగిన స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పండ్లు పంపిణీ చేశారు.

యువతకు స్ఫూర్తి అబ్దుల్‌కలాం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం నేటి యువతకు స్ఫూర్తి అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ కలాం దేశానికి రాష్ట్రపతిగా, శాస్త్రవేతగా అందించిన సేవలను కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో యువత ముందుకు నడవాలన్నారు. పేదరికం ప్రతిభకు అడ్డు కాదాని కలాం నిరూపించారన్నారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు శీరంశెట్టి పూర్ణచంద్రరావు, షేక్ రెహమాతున్నిసా, యరడ్ల ఆంజనేయరెడ్డి, ఇర్ఫాన్, బాపతి కోటిరెడ్డి, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అబ్దుల్‌కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు



నివాళులర్పిస్తున్న షేక్ ఆసిఫ్

అబ్దుల్ కలాం స్ఫూర్తిని కొనసాగించాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం స్ఫూర్తిని కొనసాగించేందుకు అందరూ పాటుపడాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు షేక్ ఆసిఫ్ అన్నారు. వించిపేటలోని ఆసిఫ్ కార్యాలయంలో భారతరత్న డాక్టర్ అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యావేత్తగా, శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా వివిధ హోదాల్లో భారతదేశ వికాసానికి అబ్దుల్ కలాం విశేషసేవలందించారన్నారు. అంతరిక్ష పరిశోధనల్లో అబ్దుల్ కలాం అందించిన భాగస్వామ్యం అపూర్వమని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు నయీమ్, యాకోబ్, జాకీర్, ఖాజా, రహీమ్, జాబీద్ పాల్గొన్నారు.

అమ్మ సన్నిధిలో భవానీలు



హుండీలో వేసిన కానుకలను వేరు చేస్తున్న సిబ్బంది

ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వరస్వామి సన్నిధిలో భవానీల రద్దీ కొనసాగుతోంది. పెద్ద సంఖ్యలో భక్తులు, భవానీలు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. అమ్మవారిని దర్శించుకున్న భవానీలు కొండ దిగువకు చేరుకుని ఇరుముడులు సమర్పించి, దీక్షలను విరమించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



వస్త్రాలు, వ్యర్థాలను ట్రాక్టర్‌లో వేస్తున్న కార్మికులు



కనకదుర్గమ్మవారు



అమ్మవారిని దర్శించుకుంటున్న భవానీలు

విజేతలకు అభినందన

కంకిపాడు: గోసాల హెచ్ఎంకే హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను పాఠశాల ప్రిన్సిపాల్ సుక్‌మిత్ కౌర్, డైరెక్టర్ వసంత్ కుమార్ మంగళవారం అభినందించారు. వారు మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పెనమలూరు నియోజకవర్గ స్థాయి అండర్–14 బాల బాలికల వాలీబాల్ పోటీలు ఉయ్యూరులో మంగళవారం జరిగాయన్నారు. పోటీల్లో పాఠశాలకు చెందిన క్రీడాకారులు ఎం.అక్షయ, యార్లగడ్డ నిరుపమ, ఎం.గౌతమ్‌కృష్ణ ప్రతిభ చాటి జిల్లా స్థాయి జట్టులో స్థానం సాధించారన్నారు. ఈనెల 16, 17 తేదీల్లో విజయవాడలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

డిబేట్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

నున్న(విజయవాడరూరల్): వారధి ఫౌండేషన్ రాష్ట్ర స్థాయి డిబేట్ పోటీ–2024లో నున్న జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు ప్రతిభ చాటారు. రిటైర్డ్ సీఎస్ డాక్టర్ మోహన్‌కందా ఆధ్వర్యంలో నిర్వహించిన వారధి ఫౌండేషన్ –రాష్ట్ర స్థాయి డిబేట్ పోటీ నందు నున్న జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినులు జి.సంధ్య, కె.సలోమి, ఎ.ఐశ్వర్య ఎన్టీఆర్ జిల్లా తరఫున పాల్గొని మూడో స్థానం సాధించి రూ. 27వేల నగదు బహుమతి అందుకున్నారని హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వి.భూపాల్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. విజేతలను గైడ్ టీచర్ పి.నాగేశ్వరరావును ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఎంపీటీసీకి గాయాలు

నున్న(విజయవాడరూరల్): రోడ్డు ప్రమాదంలో నున్న గ్రామ ఎంపీటీసీ సభ్యుడు ప్రత్తిపాటి రవీంద్ర(నాని)కు గాయాలయ్యాయి. మంగళవారం సాయంత్రం బైక్‌పై నున్న నుంచి విజయవాడ వెళుతుండగా డీమార్ట్ వద్ద రోడ్డుపై అనుకొని విధంగా వేగంగా వచ్చిన గేదె ఢీ కొనడంతో ఎంపీటీసీ సభ్యుడి తలకు గాయమైంది. పారిశుద్ధ్య సిబ్బంది ఆయనను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి చేర్పించారు.